క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రక్షిత

గుడిపాల: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని బొమ్మసముద్రం పీహెచ్‌సీ వైద్యాధికారి రక్షిత అన్నారు. గురువారం వెంగమాంబపురంలో 104 వాహనం ద్వారా ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత ముసురు వానలు పడుతుండడంతో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం షుగర్, బీపీ, మోకాళ్ల నొప్పులు, గర్భిణులు, బాలింతలకు చికిత్సలు చేసి, మందులను ఉచితంగా అందజేశారు. ఇంటివద్ద మంచానికే పరిమితమైన వారి ఇళ్లవద్దకు వెళ్లి వైద్య పరీక్షలు చేశారు. గర్భిణులకు ప్రతివారం ప్రత్యేకంగా వైద్యపరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది హైమావతి, సుమతి, కార్లి నమ్మ, రీటాలు పాల్గొన్నారు.

వ్యాధుల కట్టడికి చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ

చిత్తూరు రూరల్(కాణిపాకం): సీజనల్ వ్యాధుల కట్టడికి చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి సుధారాణి పేర్కొన్నారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో గురువారం ఆమె జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో జోరుగా వర్షాలు కురుస్తున్నాయన్నారు. ఈ కారణంగా సీజనల్ ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. డెంగీ, చికెన్‌గున్యా, డయేరియా తదితర వ్యాధుల వ్యాప్తిపై శ్రద్ధ వహించాలన్నారు. పల్లెల్లో పర్యటిస్తూ.. సీజనల్ వ్యాధుల కట్టడికి సమష్టిగా పనిచేయాలన్నారు. అలాగే ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డును విధిగా నిర్వర్తించాలన్నారు. టీబీ అధికారి వెంకట ప్రసాద్, డీఐఓ హనుమంతరావు, వైద్యులు సుదర్శన్, ప్రవీణ, అనూష, జార్జి, వేణుగోపాల్, జయరాముడు, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

జీవన ఎరువుల వాడకంపై రైతులకు శిక్షణ



రైతులకు విత్తనాలను పంపిణీ చేస్తున్న లక్ష్మీప్రసన్న

గుడిపాల: జీవన ఎరువుల వాడకంపై ప్రతి రైతూ అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయశాఖ జిల్లా వనరుల కేంద్రం అధికారి లక్ష్మీ ప్రసన్న అన్నారు. గురువారం వసంతాపురం రైతు సేవా కేంద్రంలో జీవన ఎరువుల వినియోగంపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రసాయనిక ఎరువుల వాడకాన్ని మోతాదు మించి వాడితే అనర్థకమని, సాగు ఖర్చులు అధికమవుతాయని సూచించారు. రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయంగా జీవన ఎరువుల వాడకంతో ఖర్చులు తగ్గి, నేల సారం పెరుగుతుందన్నారు. రైతులు జీవన ఎరువులు, పచ్చిరొట్ట, సేంద్రియ ఎరువులు వాడాలన్నారు. అనంతరం రైతులకు ఇంటి పరిసరాల్లో కాయగూరల సాగుకు సంబంధించి విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది సోనియా, దీపక్, శ్రీకాంత్, దేవేంద్రలు పాల్గొన్నారు.

మహిళా డాక్టర్‌ను నియమించండి



ఎమ్మెల్యేకి వినతిపత్రం అందజేస్తున్న డాక్టర్ రెడ్డెప్ప

ఐరాల: స్థానిక పీహెచ్‌సీలో మహిళా డాక్టర్‌ను నియమించాలని వైద్యాధికారి రెడ్డెప్ప గురువారం పాలకలలో ఎమ్మెల్యే మురళీమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ పీహెచ్‌సీలో మహిళా డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న పూర్ణలత మెటర్నిటీ సెలవులో ఉన్నారని, దీంతో ఓపీతో పాటు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి తానే వెళ్లాల్సి వస్తోందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపారు. పాలకల ఆయుష్ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న మహిళా డాక్టర్ వాణిని ఇక్కడికి బదిలీ చేయాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.



దిక్కులు.. పిక్కటిల్లేలా!

మండలం భయపడుతోంది.. ఓ చిన్న ప్రాణికి బెంబేలెత్తిపోతోంది. ఎటు నుంచి ఎటు వస్తుందో తెలియదు.. ఎప్పుడు మొరుగుతుందో తెలియదు.. ఎలా మీద పడుతుందో తెలియదు.. ఎక్కడ వాహనానికి అడ్డం పడుతుందో తెలియదు.. ఎప్పుడు తరుముతుందో ఊహించుకోలేం.. ఆ ప్రాణి పేరు శునకం.. బాధితులు జనం. దిక్కులు పిక్కటిల్లేలా వాటి అరుపులు.. దాడులతో నిత్యం పదుల సంఖ్యలో బాధితులు పీహెచ్‌సీ మెట్లెక్కుతున్నారు.

- గ్రామసింహాల గర్జన
- గుంపులు గుంపులుగా సంచారం
- కనిపించిన వారిపై దాడి
- చీకటి పడితే జనం బెంబేలు



నరహరిపేటలో సంచరిస్తున్న కుక్కలు

గుడిపాల: కరిచే కుక్క మొరగదు.. మొరిగే కుక్క కరవదు ఇది పాత నానుడి. ఇది ప్రస్తుతం గుడిపాల మండల పరిస్థితికి వర్తించదు. ఇప్పుడు మొరిగే కుక్క కరుస్తోంది. మొరగని కుక్క కరుస్తోంది. ప్రజలు నడిచి వెళుతున్నా.. వాహనాల్లో ప్రయాణిస్తున్నా వెంబడించి మరీ దాడికి పాల్పడుతున్నాయి. రాత్రిళ్లు మరీ దారుణం. కుక్కల గుంపు దాడి చేసి, కండలు పీకేస్తున్నాయి. గుడిపాల మండలంలో ఏ గ్రామంలో చూసినా శునకాల సంతతి గణనీయంగా పెరుగుతోంది. ఇది ప్రజల పాలిట శాపంగా మారుతోంది. గుడిపాల మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. ఎక్కడ చూసినా గుంపులు గుంపులుగా కనిపిస్తున్న గ్రామ సింహాలను చూసి ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. చికెన్ దుకాణాల నిర్వాహకులు పారబోస్తున్న వ్యర్థాలను తిని, మాంసాహారానికి బాగా అలవాటయ్యాయి. ఈ పరిస్థితుల్లో కనిపించిన మనుషులపై దాడులకు తెగబడుతున్నాయి. ముఖ్యంగా చిన్నారులపై దాడులు చేస్తుండడంతో ప్రజలు భయపడుతున్నారు. అలాగే మేకలు, గొర్రెల పాకల్లోకి కూడా ప్రవేశించి మూగ జీవాలను సైతం కరిచి చంపేస్తున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో మండలంలో కుక్కకాటు బాధితులు ఎక్కువయ్యారు. అధికారులు స్పందించి కుక్కల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జాగ్రత్తలు అవసరం

- కుక్క దగ్గరికి వస్తే ఏమాత్రం కదలకుండా నిలబడి ఉండడం ఉత్తమం. ఎట్టి పరిస్థితుల్లోనూ పరుగెత్తకూడదు. కుక్కల కళ్లల్లోకి సూటిగా చూడకూడదు. వాటి పిల్లల దగ్గరికి వెళ్లకూడదు.
- నిద్రిస్తున్నప్పుడు, తింటున్నప్పుడు, పిల్లలకు పాలిస్తున్నప్పుడు వాటిని కర్రలు, రాళ్లతో కొట్టకూడదు.
- ఒకవేళ కుక్కదాడి చేస్తే ముఖాన్ని చేతులతో కప్పుకోవాలి. ముఖాన్ని కరిస్తే ఇన్‌ఫెక్షన్ మెదడుకు త్వరగా సోకుతుంది.
- కుక్క కోపంగా దగ్గరకి వస్తే నేలవైపు చూస్తూ దానికి దూరంగా మెల్లగా నడవాలి.
- ఒకవేళ కుక్క కరిస్తే గాయాన్ని బాగా సబ్బుతో కడుక్కోవాలి.

అందుబాటులో వ్యాక్సిన్



కుక్కకాటుకు వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. ఎవరికి ఎప్పుడు కుక్కలు కరిచినా వెంటనే గుడిపాల పీహెచ్‌సీకి వస్తే వ్యాక్సిన్ వేస్తాం. నెలకు గుడిపాల, బొమ్మసముద్రం పీహెచ్‌సీల్లో 30 వరకు కుక్కకాటు బాధితులు వస్తున్నారు.

– సంధ్య, పీహెచ్‌సీ వైద్యాధికారి, గుడిపాల

ఇదిలా ఉంటే కుక్కల దాడి నుంచి తప్పించుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులు వివరిస్తున్నారు.

స్టోర్స్‌ను పరిశీలించిన ఎస్‌ఈ



అధికారులతో మాట్లాడుతున్న ఎస్‌ఈ సురేంద్రనాయుడు

చిత్తూరు కార్పొరేషన్: సాధారణ తనిఖీల్లో భాగంగా గురువారం ట్రాన్స్‌కో స్టోర్స్‌ను తిరుపతి ఎస్‌ఈ సురేంద్రనాయుడు పరిశీలించారు. కార్యాలయ పరిసరాలను పరిశీలించి శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అలాగే నూతనంగా నిర్మిస్తున్న డీఈ కార్యాలయాల సముదాయాల భవనాన్ని పరిశీలించారు. స్టోర్స్‌లో ఉన్న పరికరాల వివరాలు తెలుసుకున్నారు. నూతనంగా వేయనున్న రోడ్డు పనుల గురించి మాట్లాడారు. సకాలంలో వ్యవసాయ పరికరాలు అందించాలన్నారు. అనంతరం హమాలీలు వారి సమస్యల గురించి మాట్లాడారు. కార్యక్రమంలో టెక్నికల్ ఈఈ జగదీష్, డీఈ వసంతనాయుడు, ఏఈలు మోహన్‌రావ్, జనార్దన్‌నాయుడు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం గిరింపేటలోని చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానంలో గురువారం ఆషాఢ అమావాస్య పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి మూలవర్లకు అభిషేకాలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. దాత పార్థసారధినాయుడు భక్తులకు అన్నదానం చేశారు.

ఘనంగా వీఎస్‌ఆర్ పుట్టినరోజు



అన్బు ఆధ్వర్యంలో వృద్ధులకు దుస్తులు పంపిణీ



సంతపేటలో జ్ఞానజగదీష్ ఆధ్వర్యంలో రక్తదానం చేస్తున్న యువత

చిత్తూరు కార్పొరేషన్: నగరంలో గురువారం వైఎస్సార్ సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి(వీఎస్‌ఆర్) జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలు సేవ కార్యక్రమాలు చేశారు. తొలుత జిల్లా పార్టీ కార్యాలయంలో నాయకులు కలిసి కేక్ కట్ చేశారు. నగర పార్టీ అధ్యక్షుడు కేపీ శ్రీధర్ ఆధ్వర్యంలో నిరాశ్రయుల కేంద్రంలో అన్నదానం చేశారు. శంకరయ్యగుంటలో నాయకులు అన్బు ఆధ్వర్యంలో అన్నదానం, లెప్రసీ ఆశ్రమంలో దుస్తుల వితరణ చేశారు. కార్యక్రమంలో పార్టీ గుడిపాల అధ్యక్షుడు ప్రకాష్, నాయకులు ఇరువారం డేవిడ్, మధురెడ్డి, నౌషద్, నవాజ్‌లు పాల్గొన్నారు. సంతపేటలో మొదలియార్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానజగదీష్ ఆధ్వర్యంలో చామంతి, సురేష్, సద్దాం, సెల్వరాజ్, రవి, కరీం, ముఖేష్, ప్రకాష్, షానవాజ్, అక్బర్, కార్తీక్, సిరాజ్, వెంకటసాయి, ప్రేమ్‌చంద్, కృష్ణకాంత్, అల్తాఫ్, లోకేష్, వసంత్ మొత్తం 40 మంది రక్తదానం చేశారు. అనంతరం సంతపేట, జిల్లా ప్రభుత్వాస్పత్రిలో అన్నదానం చేశారు. పార్టీ చిత్తూరు రూరల్ మండలంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ చిత్తూరు మండల అధ్యక్షుడు జయపాల్, జెడ్పీటీసీ సభ్యుడు బాబునాయుడు, సర్పంచ్ త్యాగరాజు, అమర్‌నాథరెడ్డి నాయకులు శేఖర్, స్టాండ్లీ, వేలుస్వామి తదితరులు పాల్గొన్నారు. రెడ్డి సంఘం కార్యాలయంలో నాయకులు హరిప్రసాద్ ఆధ్వర్యంలో రక్తదానం, అన్నదానం చేశారు. మార్కెట్‌చౌక్‌లోని జైహింద్ పాఠశాలలో పిల్లలకు కోఆప్షన్ సభ్యుడు అను పిల్లలకు పుస్తకాలు, పెన్స్ అందజేశారు. జిల్లా ప్రభుత్వాస్పత్రిలో దొడ్డిపల్లె శివ, అగ్రహారం సత్య, గణేష్, తిలక్‌ల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. రామ్‌నగర్‌కాలనీలో ఇమ్రాన్, సంతపేటలో బాల, ఢిల్లీ, మనోజ్, మౌళిల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. వన్నియర్ బ్లాక్‌లో శివ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గాయత్రీదేవి, హరిణిరెడ్డి, అంజలిరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, మురళీరెడ్డి, మనోజ్‌రెడ్డి, భాస్కర్, జనార్దన్, ప్రతిమారెడ్డి, చాన్‌బాషా, నారాయణ, కృష్ణారెడ్డి, వెంకటేష్, అప్పాజీ, త్యాగ, బాబు, జీకే, శిరీష్‌రెడ్డి, హేమారెడ్డి పాల్గొన్నారు.

దాతల ఔదార్యం వెలకట్టలేనిది



పొన్నేడుపల్లెలో విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు, దాతలు

తవణంపల్లె: సర్కారు బడుల్లో చదువుకుంటున్న పేదల పిల్లలకు దాతలు ముందుకు వచ్చి ఉచితంగా విద్యాసామగ్రిని అందజేయడం ప్రశంసనీయమని అన్నారు. బుధవారం మండలంలోని పొన్నేడుపల్లెకు చెందిన యాగమూర్తి యాదవ్ కుమారుడు దివంగత రాజేష్‌కుమార్ యాదవ్ పుట్టినరోజు సందర్భంగా తవణంపల్లె క్లస్టర్ హెచ్‌ఎం వేణుగోపాల్ రెడ్డి,బంధువుల చేతుల మీదుగా 160 మంది విద్యార్థులకు విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. దిగువమొదలపల్లె పంచాయతీలోని పొన్నేడుపల్లె, దిగువ మొదలపల్లె ఆదర్శ పాఠశాలలతోపాటు జి.వడ్డిపల్లె, చిగరాకులపల్లె ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థులకు నోట్‌బుక్‌లు, పెన్నులు, పెన్సిళ్లు, బిస్కెట్లు, చాక్లెట్లు అందజేశారు. అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మోహన్ రెడ్డి, ప్రసాద్, రవి రెడ్డి, హేమావతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తపాలా కార్యాలయం వద్ద నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న తపాలా యూనియన్ నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని ప్రధాన తపాలా కార్యాలయం ఎదుట నాయకులు నిరసన వ్యక్తం చేశారు. గురువారం ఏఐపీఈయూ పోస్‌మ్యాన్, ఎంటీఎస్ యూనియన్ల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. పోస్టాఫీసుల నుంచి డెలివరీ వర్క్‌ను వేరు చేసి ఏర్పాటు చేస్తున్న ఇండిపెండెంట్ డెలివరీ సెంటర్(ఐడీసీ)లో మార్పులు చేయాలని కోరామన్నారు. ఇందులో ఎటువంటి మార్పులు చేయకపోవడంతో నిరసన చేస్తున్నామన్నారు. వీరికి ఏఐపీఈయూ, జీఆర్‌సీ, ఏఐజీడీఎస్‌యూ యూనియన్ నేతలు మద్దతు తెలిపారు. భాస్కర్, మూర్తి, రామమూర్తిశెట్టి, చిన్నబ్బ, సోమశేఖర్ పాల్గొన్నారు.

పశుసేవలకు ప్రాధాన్యం ఇవ్వాలి



మాట్లాడుతున్న డాక్టర్లు

గుడిపాల: పాడి పశువులకు సంబంధించి సేవలు అందించడానికి ప్రాధాన్యత ఇవ్వాలని పశువైద్యాధికారులు సాయిసుధ, రవితేజ అన్నారు. గురువారం గుడిపాల పశువైద్య కేంద్రంలో వెటర్నరీ అసిస్టెంట్‌లు, గోపాలమిత్రలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని 27 పంచాయతీల్లోని పశువులను ఎప్పటికప్పుడు గుర్తించి, వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ముద్ద చర్మ వ్యాధికి సంబంధించి పశువులు ఉన్నట్లయితే వాటికి సంబంధించి చికిత్సలు చేయాలని సూచించారు. డ్వాక్రా మహిళలకు సంబంధించి ప్రతి గ్రామంలో సర్వే చేసి వారికి ఏమైనా పశువులు కావాలా, వద్దా అని అడిగి తెలుసుకోవాలన్నారు. వారికి పశువులు కావాలంటే వాటికి సంబంధించి బ్యాంకుల ద్వారా రుణాలను మంజూరు చేసి వారిని అభివృద్ధి చేసేలా ముందుకు సాగాలన్నారు.

మామిడిని ర్యాంపులకు తరలిస్తేనే సబ్సిడీ

గంగవరం: మామిడి కాయలను పలమనేరు, బంగారుపాళెం ర్యాంపులకు తరలిస్తేనే ప్రభుత్వ సబ్సిడీని రైతులు పొందే అవకాశం ఉంటుందని ఉద్యాన శాఖాధికారి వరప్రసాద్ తెలిపారు. అదే విధంగా మామిడికి ప్రభుత్వ మద్దతు ధర కోసం ఈ వారంలోపు మామిడి కాయలను పూర్తిగా కోసి జ్యూస్ ఫ్యాక్టరీ లేదా మండీలు, ర్యాంపులకు తరలించాలన్నారు. ఇప్పటికే అన్ని రకాల మామిడి కాయలను ర్యాంపులు, ఫ్యాక్టరీలు, మండీలకు తరలించిన రైతులు ప్రభుత్వ సబ్సిడీకి నమోదు చేసుకున్నారు. ఆఖరున బెంగళూరు రకం మామిడి కాయలు ఈ వారంలోపు కోసి రిజిస్టర్ చేసుకున్న మండీలు లేదా ర్యాంపులు, ఫ్యాక్టరీలకు తరలించి ప్రభుత్వ సబ్సిడీకి వెంటనే నమోదు చేసుకోవాలని రైతులకు సూచించారు. ఎట్టి పరిస్థితిలోనూ ఆలస్యం చేయవద్దని లేకపోతే సబ్సిడీ రాదని పేర్కొన్నారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ



నోటు పుస్తకాల పంపిణీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): వైఎస్‌ఆర్ సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని చిత్తూరు మండలం తాళంబేడు, బీఎస్‌ఆర్‌పేట, పచ్చనపల్లి, తుమ్మింద గ్రామాల్లో గురువారం విద్యా సామగ్రి పంపిణీ చేపట్టారు. జెడ్పీ, ప్రాథమిక పాఠశాలలోని వందలాది పిల్లలకు నోటు పుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నులు, ఇతర పుస్తక సామగ్రిని అందించారు. వైఎస్‌ఆర్ సీపీ నేతలు పాల్గొన్నారు.

బస్టాండు బురదమయం



బురదమయమైన అరగొండ కొత్త బస్టాండు



అరగొండ కొత్త బస్టాండులో బురద దాటడానికి అవస్థలు పడుతున్న వాహనదారులు, ప్రయాణికులు

- అరగొండ బస్టాండులో ప్రయాణికుల అవస్థలు

తవణంపల్లె: మండలంలోని మేజర్ పంచాయతీ అరగొండ కొత్త బస్టాండు దారుణంగా మారింది. చాలాకాలంగా వర్షం కురిస్తే అరగొండ కొత్తబస్టాండులో వర్షం నీరు నిల్వ చేరి కుంటను తలపిస్తోంది. ఈ నేపథ్యంలో పంచాయతీ అధికారులు బస్టాండులో నీరు నిల్వ చేరకుండా సిమెంటు రోడ్డునే ఎత్తు చేసేందుకు ఉన్న సిమెంట్ రోడ్డును జేసీబీతో పగలకొట్టి ధ్వంసం చేసి, సుమారు 20 రోజులు గడుస్తోంది. కొద్ది రోజుల తర్వాత వ్యర్థాలను తొలగించారు. దీంతో గోతి ఏర్పడింది. పంచాయతీ అధికారులు బస్టాండులో కొంత భాగం సిమెంటు రోడ్డు నిర్మించి, మిగిలిన స్థలంలో సిమెంటు రోడ్డు నిర్మించలేదు. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు కొత్త బస్టాండులో వర్షపు నీరు నిల్వ చేరింది. బస్టాండులో వాహనాలు, ప్రజలు రద్దీగా తిరగడంతో బురదమయమై వాహనాలు, ప్రయాణికుల రాకపోకలకు నానా అవస్థలు పడుతున్నారు. బస్టాండులో బురదతో పలువురు ద్విచక్ర వాహనదారులు జారి పడి ప్రమాదానికి గురయ్యారు. బురదలో తిరగలేక ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతంగా మారింది. అధికారులు స్పందించి అరగొండ కొత్త బస్టాండులో యుద్ధ ప్రాతిపదికన సిమెంటు రోడ్డు నిర్మించాల్సి ఉంది.

ఘనంగా అమావాస్య పూజలు



చౌడేపల్లె: విశేషాలంకరణలో బోయకొండ గంగమ్మ



పుంగనూరు: ప్రత్యేకాలంకరణలో విరూపాక్షి మారెమ్మ

చౌడేపల్లె: పుణ్య క్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో గురువారం అమావాస్య పూజలను ఘనంగా నిర్వహించారు. అర్చకులు ముందుగా ఆలయాన్ని శుద్ధి చేసి అమ్మవారిని విశేషంగా అలంకరించారు. ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ఆషాఢ మాసం ముగియడంతో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కోర్కెలు తీరిన భక్తులు మొక్కులు చెల్లించారు. వారికి ఈవో ఏకాంబరం పర్యవేక్షణలో అధికారులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

విరూపాక్షి మారెమ్మకు అమావాస్య పూజలు

పుంగనూరు: పట్టణంలోని బస్టాండులో వెలసిన విరూపాక్షి మారెమ్మ ఆలయంలో గురువారం అమావాస్య పూజలను ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి చలిపిండి దీపాలు వెలిగించి, గుమ్మడికాయలు, నిమ్మకాయలు, మిరపకాయలు, చల్లముద్ద పెట్టి మొక్కులు చెల్లించారు.

- చిత్తూరులో విచ్చలవిడిగా పేకాట క్లబ్బులు
- శివారు ప్రాంతాల్లో దాడులతో ఖాకీల సరి
- నగర నడిబొడ్డున జరిగే జూదంపై నిఘా ఏదీ?
- భారీ మొత్తంలో నగదు పోగొట్టుకుంటున్న వ్యసనపరులు

వీధి వీధికో క్లబ్బు..!

చిత్తూరు అర్బన్: జిల్లాలో కేంద్రంగా ప్రస్తుతం పేకాట క్లబ్బులు జోరుగా సాగుతున్నాయి. ఇవన్నీ కూడా కూటమి నేతల అండదండలున్న వ్యక్తుల కనుసన్నల్లో జరుగుతున్నాయనే ఆరోపణలున్నాయి. వీధి వీధిలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న పేకాట క్లబ్బులను నియంత్రించడంలో ఖాకీలు పెద్దగా దృష్టి సారించడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మధ్య తరగతి నుంచి సంపన్న కుటుంబాలకు చెందిన పలువురు వ్యక్తులు, ఈ జూదంలో భారీగా డబ్బులు పోగొట్టుకుని రోడ్డున పడుతున్నారు.

ఇక్కడే అత్యధికం..

పేకాటలో ప్రస్తుతం చిత్తూరులో సాగుతున్నది లోపల బయట. నగరంలోని గంగనపల్లెలో ఇది పెద్ద ఎత్తున సాగుతోంది. అధికారపార్టీకి చెందిన ఇద్దరు యువకులు ఈ క్లబ్బును నడిపిస్తూ పబ్బం గడుపుకుంటున్నట్లు ఆ పార్టీ వ్యక్తులే విమర్శిస్తున్నారు. ఇక సంతపేట, వన్నియర్ బ్లాక్, తేనెబండ, కట్టమంచి, రామ్‌నగర్ కాలనీ, గిరింపేట, కొంగారెడ్డిపల్లె, కైలాశపురం, సత్యనారాయణపురం, దుర్గానగర్ కాలనీ, హై రోడ్డులోని ఓ సిమెంట్ దుకాణం, బాలాజీ కాలనీ, ముత్తిరేవుల, పూనేపల్లె, దొడ్డిపల్లె, కట్టెలదొడ్డి ప్రాంతం, కాణిపాకం బైపాస్‌లోని ఓ దాబా ప్రాంతాల వద్ద పేకాట క్లబ్‌లు నడుస్తున్నట్లు తెలుస్తోంది. గంటల వ్యవధిలో ఒక్కొక్కరు రూ.లక్షల్లో పోగొట్టుకోవడం, మరికొందరు రూ.లక్షలు రాబట్టుకోవడం జరుగుతోంది. నెలకు రూ.కోట్లలో టర్నోవర్ జరుగుతోంది.

భారీ ఆదాయం..

పేకాట క్లబ్‌లను నిర్వహిస్తున్న వారిలో కూటమి పార్టీకి చెందిన సానుభూతిపరులున్నారు. మరికొందరు గతంలో వైఎస్సార్‌సీపీలో ఉంటూ ఇప్పుడు కూటమిలో కొనసాగుతున్న వాళ్లు ఉన్నారు. కొందరు కార్పొరేటర్ స్థాయి, వార్డు ఇన్‌చార్జ్‌లు, మహిళా కార్పొరేటర్లకు చెందిన పతులు కూడా ఉన్నారు. రోజుకు రూ.30 వేల వరకు క్లబ్ నిర్వహణ వ్యయంగా వసూలు చేస్తున్నారు. డబ్బులు పోగొట్టుకున్న వ్యక్తికి ఎలాంటి పూచికత్తు లేకుండా అప్పటికప్పుడే డబ్బులు ఇచ్చే వాళ్లూ ఉన్నారు. రూ.లక్ష ఇస్తే సాయంత్రంలోపు రూ.1.20 లక్షలు ఇచ్చేయాలి. అంటే రోజుకు రూ.20 వడ్డీ అన్నమాట. ఇలా వడ్డీలకు ఇచ్చే వ్యక్తులు, క్లబ్ నిర్వాహకులకు రూ.20 వేలు చెల్లించాలి. నాలుగు టేబుళ్లు, 12 కుర్చీలే పెట్టుబడిగా సాగుతున్న ఈ జూదం నుంచి కూటమి పార్టీలోని కొందరు నేతలకు భారీగా కాసుల వర్షం కురిపిస్తోంది. అయితే దీన్ని అదే పార్టీలోని చాలా మంది నేతలు, కార్యకర్తలు వ్యతిరేకిస్తున్నారు.

సమాచారం ఇవ్వండి..

పేకాట ఎక్కడెక్కడ ఆడుతున్నారో ఎవరైనా సమాచారం ఇస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. మా వాళ్లు ఎవరైనా తప్పు చేస్తే, వాళ్లపైనే సీరియస్ యాక్షన్ ఉంటుంది. ఎక్కడైనా పేకాట ఆడుతుంటే డయల్-100, పోలీసు వాట్సప్-9440900005, వన్‌టౌన్ సీఐ-9440796707, టూటౌన్ సీఐ- 9491074517 నంబర్లకు సమాచారం ఇస్తే, సమాచారం ఇచ్చిన వాళ్ల వివరాలు రహస్యంగా ఉంచుతాం.

– మహేశ్వర, వన్‌టౌన్ సీఐ,చిత్తూరు